క్లుప్తంగా

జీపీ ఉద్యోగుల కొవ్వొత్తుల ర్యాలీ



ఆత్మకూరు : పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా జీపీ ఉద్యోగులు ఆదివారం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీ ఉద్యోగులు, సిబ్బంది పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహాదారుడు పోరెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర ఆర్గనైజర్ వడ్డేపల్లి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు మడిపల్లి కుమారస్వామి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు నరేశ్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, కార్యదర్శి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రాజు, జీపీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు మంత్రి రాక

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ నేడు (సోమవారం) రానున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ నిర్వహించనున్నారు. అనంతరం ముల్కనూర్‌లోని శ్రీగార్డెన్‌లో భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొంటారన్నారు. అక్కడి నుంచి ఎల్కతుర్తి మండలానికి చేరుకొని దామెర, చింతలపల్లి, వీరనారాయణపూర్, బావుపేట గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం స్థానిక ఎస్‌ఎంఆర్ గార్డెన్‌లో భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొంటారని చెప్పారు. అధికారులు, పార్టీ నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సంస్థ జిల్లా చైర్మన్ ఎం.డీ అజీజ్‌ఖాన్



పరకాల : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు గ్రంథాలయ సేవలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎం.డీ అజీజ్‌ఖాన్ కోరారు. స్థానిక గ్రంథాలయంలో వైఫై ఉచిత సేవలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఇప్పటికే పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచడం జరిగిందని, పాఠకులకు అందుబాటులోకి వైఫై సేవలను సైతం అందుబాటులోకి తీసుకరావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయా సేవలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ లక్ష్యం సాధించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పోరండ్ల సంతోష్, లైబ్రేరియన్ డి.రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పసుల రమేష్, మార్క రఘుపతిగౌడ్, నల్లెల అనిల్, ఎం.డీ అలీ, పరమేశ్వర్, సదయ్య, మొగిళి, సుధాకర్, సృజన్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలి



విద్యారణ్యపురి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని హంటర్‌రోడ్డులో అవోపా భవన్‌లో ఆదివారం నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ ఉద్యమ తరగతుల్లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని, ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయ ఉద్యమ చరిత్ర గురించి వివరించారు. టీఎస్‌యూటీఎఫ్ మరో రాష్ట్ర కార్యదర్శి రంజిత్ లీవ్ రూల్స్, సర్వీస్ రూల్స్ గురించి వివరించారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు సీహెచ్.రవీందర్‌రాజు, తాటికాయల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెండెం రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రాజారాం, మేకరి దామోదర్, జ్యోతి, అన్నాదేవి, పద్మలత, బాధ్యులు సీహెచ్.లింగారావు, సీఎస్‌ఆర్.మల్లిక్, చంద్రయ్య, రమేష్, కరుణాకర్, పాక శ్రీనివాస్, నామోజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పెండింగ్

- చెరువు మట్టి కోసం రైతుల ఎదురు చూపులు
- పూడికతీత పనులు ప్రస్తుతానికి లేవంటున్న అధికారులు
- ప్రారంభించాలని కోరుతున్న రైతులు



ట్రాక్టర్లలో చెరువు పూడిక మట్టిని లోడ్ చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

ఐనవోలు : రైతులు వేసవి కాలంలో చెరువుల్లోని పూడిక మట్టిని పొలాలకు తరలించుకోవడం కొన్నేళ్లుగా పరిపాటిగా మారింది. చెరువు మట్టిలో సాగు భూములకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉండటమే అందుకు కారణం. ఒండ్రుమట్టి వల్ల పంట పొలాలకు కలిగే లాభాలను రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా కొన్నేళ నుంచి ఉపయోగించుకుంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లోని చెరువుల్లో నీరు తగ్గుముఖం పట్టినప్పటికీ ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు అధికారులు చెరువు పూడికతీత పనులు చేపట్టడం లేదు. ఉపాధి కూలీలు, రైతులు పూడికతీతపై క్షేత్రస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్లను అడుగుతున్నప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదు. వాస్తవానికి పూడికతీత పనులు చేస్తే ఉపాధి కూలీలకు రూ.300 వేతనం లభించే అవకాశం ఉంటుందని, ప్రస్తుతం వివిధ రకాల పనులు చేస్తుండగా రూ.180–250 వరకు మాత్రమే కూలీ లభిస్తుందని పలువురు ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఉపాధి హామీలో చేపడుతున్న పలు రకాల పనుల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండటం లేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పూడిక మట్టితో రైతుకు ఎన్నో ప్రయోజనాలు

చెరువు,కుంటల్లోని పూడిక మట్టిని చెలుక, పొలాల్లో వేయడంతో రైతులకు అనేక లాభాలున్నాయి. ముఖ్యంగా చెరువు మట్టిలో నత్రజని, పొటాష్, మెగ్నీషియం, జింక్‌తో పాటు అనేక సూక్ష్మ పోషకాలు లభ్యమవుతాయి. వీటివల్ల పంటకు తెగుళ్లను తట్టుకునే శక్తితోపాటు సరైన మోతాదులో పంటకు సూక్ష్మ పోషకాలు అందుతాయి. దీంతో రసాయన ఎరువుల వినియోగం లేకుండానే పంటలు పండుతాయి. రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు 15–50 ట్రాక్టర్ ట్రిప్పుల వరకు పూడిక మట్టిని రైతులు చెలుకలు, పొలాల్లో పోసుకుంటున్నారు.

జిల్లాలో త్వరగా పూడికమట్టి పనులు ప్రారంభించాలి

వరంగల్, ములుగు జిల్లాల్లో ఉపాధిహామీ పథకంలో ఇప్పటికే పూడికతీత పనులు ప్రారంభం కాగా ఇప్పటి వరకు హన్మకొండ జిల్లాలో చెరువు పూడికతీత పనులు ప్రారంభం కాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతోనే మండలంలో చెరువు పూడికతీత పనులు ప్రారంభించలేదని ఏపీఓ నక్క కుమారస్వామి తెలిపారు. అటు రైతులకు, ఇటు ఉపాధి కూలీలకు ప్రయోజనం కలిగించే చెరువు పూడికతీత పనులను త్వరగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా ప్రారంభించాలి



రైతులకు ఎంతో ప్రయోజనాలను కలిగించే చెరువు పూడిక తీత పనులను ఉపాధిహామీలో ప్రారంభించాలి. పూడిక మట్టిని ఎర్ర, తేలికపాటి భూమిలో వేసి దున్నడం వల్ల మంచి పోషకాలతో కూడిన నాణ్యమైన పంట పండుతుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. ఉపాధి హామీలో చెరువులో ఫాంపాండ్ తవ్వడంతో పెద్దగా ప్రయోజనం ఉండదు. ఉపాధి హామీ పథకంలో చెరువు పూడికతీత పనులు చేపట్టాలి. త్వరగా పనులు ప్రారంభమయ్యే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. – జెట్టబోయిన రాజు, రైతు, నందనం

ఉప్పల్ రైల్వేగేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్



ఉప్పల్ రైల్వేగేట్‌కు ఇరువైపులా పెద్ద ఎత్తున నిలిచిపోయిన వాహనాలు

కమలాపూర్ : ఎల్కతుర్తి మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు విధించిన ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో మండలంలోని ఉప్పల్ రైల్వే గేట్ వద్ద పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. కరీంనగర్ నుంచి వరంగల్, వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్లే వాహనాలను హుజూరాబాద్‌లోని పరకాల క్రాస్ రోడ్డు నుంచి ఉప్పల్, కమలాపూర్, గూడూరు, అంబాల, ముచ్చర్ల మీదుగా ఓఆర్‌ఆర్‌కు దారి మళ్లించిన విషయం తెలిసిందే. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పెద్ద ఎత్తున కొనసాగాయి. హుజూరాబాద్–పరకాల మార్గంలో మండలంలోని ఉప్పల్‌లో రైల్వే గేట్ పడినప్పుడల్లా రైల్వే గేట్‌కు ఇరువైపులా వందల సంఖ్యలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేలాది వాహనాల రాకపోకలతో ఒకానొక దశలో రైల్వే గేట్ వేయడానికి కూడా రైల్వే సిబ్బందికి ఇబ్బందులు తలెత్తాయి.

మార్షల్ ఆర్ట్స్‌లో నిహాల్ ప్రపంచ రికార్డు

- అత్యధిక ఎయిర్ పంచెస్ కొట్టిన బొల్లేపాక
- హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



మెడల్ అందుకుంటున్న నిహాల్

ధర్మసాగర్ : మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన బొల్లేపాక నిహాల్ తన అసాధారణ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇండో–నేపాల్ ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో అత్యధిక ఎయిర్ పంచెస్ (45,808) కొట్టి హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. ఈ ఘనతను సాధించడంలో అమీకల స్పోర్ట్స్ అకాడమీ, విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రోత్సాహం మరువరానిది. మొత్తం 409 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో నిహాల్ తన అసాధారణమైన శ్రమ, పట్టుదలతో అందరినీ ఆకట్టుకున్నాడు. నిహాల్ చాంపియన్స్ షోటోకాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ (సీఎస్‌ఎంఏ)లో శిక్షణ పొందుతున్నాడు. ఈ అకాడమీ వ్యవస్థాపకుడు డైరెక్టర్ రవికుమార్ గౌడ్ నిహాల్‌కు మార్గ దర్శకుడిగా నిలిచారు. అతడి విజయాన్ని కుటుంబ సభ్యులు, గురువులు, గ్రామస్తులు అభినందిస్తూ గర్వపడుతున్నారు. భవిష్యత్‌లోనూ నిహాల్ మరింత ఉన్నత స్థాయిలో దేశానికి పేరు తెచ్చేలా మారాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. నిహాల్ ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని సేయింట్ మేరీస్ బెథానీ కాన్వెంట్ విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్నాడు.

గోడ కూలి మీద పడి యువకుడి మృతి

- న్యాయం చేయాలని ఇంటి ముందు మృతదేహంతో ఆందోళన
- మిన్నంటిన కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు



నాగరాజు (ఫైల్)



గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జక్కుల పరమేశ్

శాయంపేట : గోడ కూలి మీద పడి యువకుడి మృతి సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మారెపల్లి నాగరాజు (35) డ్రిల్లింగ్ పని చేసుకుంటూ తన జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. నాగరాజు ఇదే గ్రామానికి చెందిన ప్లంబర్ గాజె సాంబరాజుతో కలిసి గ్రామంలోని కన్నాపురం రాజవీరయ్య (రిటైర్డ్ టీచర్) ఇంటి గోడలు, సజ్జలు కూలగొట్టే పని రూ. 9000లకు కుదుర్చుకున్నారు. దీంతో సాంబరాజు, నాగరాజులు పల్లం అనిల్‌ను కూలీకి రమ్మన్నారు. నాగరాజు డ్రిల్ మిషన్‌తో సజ్జ డ్రిల్లింగ్ చేస్తుండగా పగలకపోవడంతో సాంబరాజు డ్రిల్ బిట్ కొత్తది తీసుకురావడానికి ఇంటికి వెళ్లి రావడంతో నాగరాజు, అనిల్ చెరో వైపు గన్నుతో కొడుతుండగా ఒక్కసారిగా నాగరాజు ఉన్న సజ్జ కూలడంతో ప్రక్కనే ఉన్న సైడ్ డ్రెయినేజీలో పడగా సజ్జపైన ఉన్న వెలివేషన్ గోడ ఒక్కసారిగా కూలి నాగరాజుపై పడింది. దీంతో అనిల్ సజ్జపై నుండి దూకడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. సాంబరాజు, అనిల్ చుట్టు ప్రక్కల వారి సహకారంతో లేపే ప్రయత్నం చేయగా లేవకపోవడంతో గోడను పగులగొట్టి నాగరాజును బయటకు తీసి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది నాగరాజును పరీక్షించి అప్పటికే మృతి చెంది ఉన్నాడని తేల్చారు. స్థానికులు, నాగరాజు బంధువులు రాజవీరయ్య ఇంటి ముందు టెంట్ వేసి ఆందోళన చేపట్టారు. మృతుడికి నీరుకుళ్ల గ్రామానికి చెందిన భవానితో నాలుగున్నర ఏళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు కవల పిల్లలు భవ్య, భావని ఉన్నారు. నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు ఆందోళనకు దిగారు. స్థానిక ఎస్సై జక్కుల పరమేశ్ గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలించి దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బంధువులు ఆందోళన విరమించి నాగరాజు మృతదేహాన్ని పరకాల ఏరియా ఆసుపత్రికి మార్చురీకి తరలించారు. నాగరాజు మృతితో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. దీంతో శాయంపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించి ఓదార్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రశాంత్‌నగర్ ప్రాంతంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పర్సు పోగొట్టుకున్న భక్తురాలు

హన్మకొండ కల్చరల్: అమ్మవారి దర్శనానికి హైదరాబాద్ నుంచి ఆదివారం వచ్చిన ఒక భక్తురాలి రూ.4 వేల నగదు, 13 గ్రాముల బంగారం ఉన్న పర్సు పోగొట్టుకుంది. ఈ మేరకు దేవాలయం ఈఓ శేషుభారతి తెలిపిన వివరాల ప్రకారం భక్తురాలు తన భర్త, మూడేళ్ల పాపతో కలిసి ఉదయం అమ్మవారిని దర్శించుకుని దేవాలయం లోపల ఉన్న భద్రేశ్వరస్వామి దేవాలయం వెనుక సేదదీరుతున్నారు. భక్తురాలి పాప తాగునీరు అడగడంతో బయటకు వెళ్లింది. అనంతరం కూర్చున్న ప్రదేశంలో ఉంచిన పర్సు కనిపించ లేదు. దీంతో దేవాలయంలోని స్వీపర్లు, సిబ్బందిని విచారించగా, వారు చూడలేదని తెలపడంతో మట్టెవాడ పోలీసులకు సమాచారం అందించానని ఆమె తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించడానికి సోమవారం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తామని శేషుభారతి తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు : శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు.. జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం జరిగింది. కొత్త బస్టాండ్ నుంచి పోచమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా నాయకులు మౌనం పాటించారు. శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే అన్ని వర్గాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. దేశ సమగ్రతకు రాజ్యాంగం తోడ్పడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ సూచనల మేరకు హిందువులు మాత్రమే భారతీయులు అని చెప్పడం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో ఇతర మతాల వారు దేశంలో ఉండొద్దు అని కూడా ప్రకటిస్తారన్నారు.కార్యక్రమంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కూచన రవళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాపురం రమేష్, మండల కో ఆర్డినేటర్ రామకృష్ణ జిల్లా నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వాసు, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, కుమారస్వామి, యూత్ అధ్యక్షుడు సందీప్, జైపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఖాజా, శివారెడ్డి, అలువాల రవి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దంపతులకు ప్రసాదం అందజేస్తున్న బ్రహ్మశ్రీ సంపత్‌కుమార్ శర్మ

దేవస్థానం సర్వతోముఖాభివృద్ధికి కృషి

పరకాల : పట్టణంలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావుతో పాటు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ ఎమ్మెల్యేను కలిసి ఆలయ ప్రాకార మంటపం, ముఖమంటపం, మహారాజగోపురములు, శిల శిఖరములతో పాటు ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ నిధుల కోసం విన్నవించారు. వారి విన్నపంపై స్పందించిన తక్షణమే ఎమ్మెల్యే రేవూరి సంబంధిత పనులకు ఆలయాన్ని సందర్శించి కావాల్సిన నమునాలను, అంచనా వ్యయాన్ని వారం రోజుల్లో నివేదించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులకు బ్రహ్మశ్రీ సంపత్‌కుమార్ శర్మ స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కార్మికుల హక్కుల దీక్షా దినం మేడే



మాట్లాడుతున్న వీఎస్.రావు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్.రావు

కేయూ క్యాంపస్: కార్మికుల హక్కుల దీక్షా దినం మేడే అని, కార్మికవర్గ ప్రతిఘటన వల్లనే ఆనాడు 8 పనిగంటల పనిదినాలను చట్టం చేశారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్.రావు అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ సెమినార్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటించాలని సూచించారు. కార్మికులను కట్టుబానిసలుగా చేసేవిధంగా కార్మిక కోడ్‌లు రూపొందించబడినట్లు తెలిపారు. దీనికి వ్యతిరేకంగా మేడే పోరాట స్ఫూర్తితో ఉద్యోగులు, కార్మికులు ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రం అనుసరిస్తున్న నయా ఉదార విధానాలను ప్రతిఘటిస్తూ, కార్మికులను ఐక్యం చేస్తూ మేడేను జరపుకోవాలని సూచించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జిల్లా నాయకులు మెట్టు రవి, బొట్ల చక్రపాణి, రాంచందర్, పుల్లా అశోక్, రవి, రజిత, రాజేశ్వరి, కల్పన, పల్లె రామన్న, యాకయ్య, సంపత్, కార్మికులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

హన్మకొండ కల్చరల్: హనుమకొండ ఎన్‌జీఓ ప్రగతినగర్ కాలనీఫేస్ –2లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనర్సమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 21 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పొందిన వారికి ఉచితంగా హాస్టల్ వసతి, ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉచితంగా బోధన ఉంటుందని తెలిపారు. తప్పనిసరిగా వికలాంగుల సదరం గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, యూడీఐడీ కార్డు, కులం, ఆదాయం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌ఫొటోలు అందజేయాలన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు

శాయంపేట : బీఆర్‌ఎస్ పార్టీ 25 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని 24 గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, ఆయా గ్రామాల్లో గ్రామశాఖ అధ్యక్షులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, వల్పదాసి చంద్రమౌళి పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలో అన్ని వార్డుల ముఖ్యకూడళ్లలో బీఆర్‌ఎస్ జెండాను వార్డు అధ్యక్షులు ఆవిష్కరించిన అనంతరం కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో రజతోత్సవ సభకు బయలుదేరారు. చల్లా ధర్మారెడ్డి పరకాల నుంచి బయలుదేరే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

ఆత్మకూరు : ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఆత్మకూరు మండలం నుంచి అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించి వివిధ వాహనాల్లో సభకు తరలివెళ్లారు.

కమలాపూర్ : బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కమలాపూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు గులాబీ జెండాలు ఆదివారం ఎగుర వేశారు. దీంతో ఊరూరా గులాబీ జెండాలు రెపరెపలాడాయి.



శాయంపేట : పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సభకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నేతలు



ఆత్మకూరు : జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

వేలేరు : బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మల్లికుదుర్ల, పీచర గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గుండ్లసాగర్ మాజీ ఎంపీటీసీ టేకుల ఉప్పలయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రాజయ్య సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అనంతరం రజతోత్సవ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మండల కో ఆ ర్డినేటర్ సురేష్, వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



కమలాపూర్‌లో..



వేలేరు : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య



పరకాల : జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సూర్యాపేట నుంచి ఎల్కతుర్తికి ఎడ్లబండ్లు

- స్వాగతం పలికిన బీఆర్‌ఎస్ నేతలు



వేలేరు : ఎడ్లబండ్లకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

ఎల్కతుర్తి: బీఆర్‌ఎస్ రజతోత్సవ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సూర్యాపేట నుంచి ర్యాలీగా బయలుదేరిన రైతుల ఎడ్లబండ్లు ఆదివారం ఎల్కతుర్తి బస్టాండ్ కూడలికి చేరుకోవడంతో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, నాయకులు శ్రీ పతి రమా రవీందర్‌గౌడ్, తంగెడ నగేష్, గోల్లె మహేందర్, తంగెడ మహేందర్, కడారి రాజు, పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (హన్మకొండ)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
ఎస్. నవీన్ (S.R) : 8919855163 (ఎల్కతుర్తి)